కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

# BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ అఫ్ న్యూ భారత్

కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 సంచిక -269 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 09-10-2026 శుక్రవారం పేజీలు : 4

# బతుకమ్మ పేరుతో బురిడీ!




- రూ.2,500పై క్లారిటీ ఇదే!
- వైరల్ వీడియోలో అసలు ట్విస్ట్
- సీఎం మాటలకే డీప్‌ఫేక్ మస్కా!
- ఆడియో మార్చి.. హామీగా ప్రచారం
- బతుకమ్మ కానుక అంటూ ఫేక్ ప్రచారం
- రూ.2,500 హామీ నిజమే.. కానీ!
- రెండు తులాల బంగారం హామీ ఫేక్
- ఏఐ ఆడియోతో వైరల్ వీడియో
- సోషల్ మీడియా ప్రచారంపై ఫ్యాక్ట్‌చెక్

**న్యూస్ డెస్క్, 08 అక్టోబర్ (బిఎన్ఎస్):** బతుకమ్మ పండుగ నుంచి మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, కల్యాణలక్ష్మి పథకం కింద రెండు తులాల బంగారం అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించినట్లుగా ఓ వీడియో వైరల్ అవుతుంది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోపై తెలంగాణ ఫ్యాక్ట్‌చెక్ టీమ్ కీలక స్పష్టత ఇచ్చింది. చక్కర్లు కొడుతున్న వీడియో మార్ఫింగ్ చేసినదని తేల్చింది. ఈ వీడియోను నమ్మవద్దని, సంక్షేమ పథకాలకు సంబంధించిన అధికారిక సమాచారాన్ని ప్రభుత్వం విడుదల చేసే వేదికల నుంచే తెలుసుకోవాలని సూచించింది.

ఫ్యాక్ట్‌చెక్ వివరాల ప్రకారం.. వైరల్ వీడియోలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్న దృశ్యాలు నిజమైనవే అయినప్పటికీ.. అందులోని ఆడియోను మార్చేశారు.

మిగతాది 2 లో..

# దసరా ప్రయాణికులకు ఆర్టీసీ బంపర్ ఆఫర్!



**న్యూస్ డెస్క్, 08 అక్టోబర్ (బిఎన్ఎస్):** దసరా పండుగ సందర్భంగా ఊళ్లకు వెళ్లే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) భారీ ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 7,000 ప్రత్యేక బస్సులను నడపాలని ఆర్టీసీ యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది. పండుగ రద్దీ ఎక్కువగా ఉండే అవకాశమున్న ఈ నెల 9, 10, 16, 17 తేదీలకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేసింది. అలాగే పండుగ ముగిసిన తర్వాత తిరిగి నగరాలకు వచ్చే ప్రయాణికుల కోసం ఈ నెల 25, 26 తేదీల్లో కూడా తిరుగు ప్రయాణ రద్దీకి అనుగుణంగా ప్రత్యేక సర్వీసులను సిద్ధం చేసింది.

# ఏపీకి కేంద్రం షాక్.. 3.71 లక్షల ఇళ్లు రద్దు!



**న్యూస్ డెస్క్, 08 అక్టోబర్ (బిఎన్ఎస్):** ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన అర్బన్ 1.0 పథకానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక స్పష్టతనిచ్చింది. రాష్ట్రంలో 2024 కంటే ముందు మంజూరై, ఇప్పటివరకు ఎలాంటి నిర్మాణాలు ప్రారంభించని దాదాపు 3.71 లక్షల గృహాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది.

# మద్యం షాపులపై అప్‌డేట్!

- 3,736 దుకాణాలకు నోటిఫికేషన్
- ఇప్పటికే 2,929 లైసెన్సుల పునరుద్ధరణ
- 92 శాతం ప్రక్రియ పూర్తి
- 3,446 దుకాణాల ప్రక్రియ పూర్తి
- ఇంకా 290 దుకాణాలు మిగిలే
- మొత్తం 807 దుకాణాలకు లాటరీ



**న్యూస్ డెస్క్, 08 అక్టోబర్ (బిఎన్ఎస్):** ఆంధ్రప్రదేశ్‌లో 2026-27 ఎక్సైజ్ పాలసీ కింద మద్యం దుకాణాల పునరుద్ధరణ, కేటాయింపు ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. రాష్ట్రంలో మొత్తం 3,736 మద్యం దుకాణాలను ప్రభుత్వం నోటిఫై చేయగా.. ఇప్పటికే 2,929 దుకాణాల లైసెన్సుల పునరుద్ధరణ పూర్తయింది. దీంతో మొత్తం నోటిఫై చేసిన దుకాణాల్లో 92 శాతం దుకాణాల ప్రక్రియ పూర్తయినట్లు ఎక్సైజ్ కమిషనర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. మరో 517 మద్యం దుకాణాలను అక్టోబర్ 8న లాటరీ ద్వారా కేటాయించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ 517 దుకాణాల కేటాయింపు పూర్తయితే మొత్తం 3,446 మద్యం దుకాణాల పునరుద్ధరణ లేదా కేటాయింపు ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు.

రాష్ట్రంలో కొత్త ఎక్సైజ్ పాలసీ 2026 అక్టోబర్ 1 నుంచి 2027 సెప్టెంబర్ 30 వరకు అమల్లో ఉంటుంది.

# చోరీ ఫిర్యాదు.. మధుమితపై కేసు!



- 118 సవర్ల నగలు చోరీపై పోలీసుల దర్యాప్తు
- మధుమితపై మరో చోరీ కేసు నమోదు
- 5 సవర్ల గొలుసు దొంగిలించిందంటూ ఫిర్యాదు
- విచారణకు రావాలన్న పోలీసుల పిలుపు
- భర్త, కుమార్తెతో ఇంటి నుంచి పరారీ
- ఇంటికి తాళం.. ఫోన్ స్విచ్ఛాఫ్

2 లో

# ఓటర్ల జాబితాకు తుది మెరుగులు!




- ఈసీ కార్యాలయానికి విపక్ష ఎంపీల భారీ ర్యాలీ
- బారికేడ్ల వద్ద పోలీసులతో ఎంపీలకు వాగ్వాదం
- బారికేడ్లు ఎక్కి నిరసన తెలిపిన రాహుల్ గాంధీ
- ఆకాశవాణి కార్యాలయంలోకి వెళ్లిన రాహుల్, ప్రియాంక
- రాత్రి వరకు కొనసాగిన హైడ్రామా.. ఎంపీల అదుపులోకి
- అనుమతి లేకుండా ప్రవేశించారంటూ పోలీసుల కేసు

# దేశమంతా 5జీ నెట్‌వర్క్!

- మొబైల్ ఇక ఫోన్ మాత్రమే కాదు
- ప్రభుత్వ సేవలకు మొబైల్ కీలకం
- 5.5 లక్షలకు పైగా బేస్ స్టేషన్లు
- పదేళ్లలో విస్తరించిన టెలికాం నెట్‌వర్క్
- డీబీటీతో రూ.50 లక్షల కోట్ల బదిలీ
- రూ.5 లక్షల కోట్ల ఆదా చేశామన్న మోదీ
- గేమింగ్.. క్రియేషన్ స్టూడియోగా మొబైల్




**న్యూస్ డెస్క్, 08 అక్టోబర్ (బిఎన్ఎస్):** దేశంలో టెలికాం రంగం, మొబైల్ ఫోన్లు కేవలం నెట్‌వర్క్‌లు, స్పెక్ట్రమ్, ఇంటర్నెట్ వేగానికే పరిమితం కాలేదని సుపరిపాలనకు, ప్రభుత్వ సేవలను వేగవంతం చేయడంలో అత్యంత కీలక సాధనంగా మారిందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. దేశ రాజధాని ఢిల్లీలోని యశోభూమిలో గురువారం ప్రారంభమైన 10వ ఇండియా మొబైల్ కాంగ్రెస్‌లో మోడీ ప్రసంగించారు. వందలాది ప్రభుత్వ సేవలు ఇప్పుడు మొబైల్ ఫోన్‌లలో అందుబాటులో ఉన్నాయని, ప్రభుత్వ సహాయం లబ్ధిదారుల మొబైల్ ఫోన్‌లకు అనుసంధానించబడిన వారి బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా బదిలీ చేయబడుతోందని అన్నారు. డిజిటల్ అనుసంధానత విద్యకు మరింత ఊతమిచ్చిందని అన్నారు.

**ఫోన్, నెట్‌వర్క్ భద్రతకు ప్రాధాన్యం:**

టెలికాం, డిజిటల్ టెక్నాలజీ ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో భద్రతా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని మోడీ ఈ సందర్భంగా అన్నారు. ఫోన్ భద్రత, నెట్‌వర్క్ భద్రత మనందరికీ ప్రాధాన్య అంశాలు అని స్పష్టం చేశారు. 2022లో ఇదే వేదికపై నుంచి మనం దేశంలో 5జి సేవలను ప్రారంభించాం.

# ఎన్నికల కమిషన్‌పై సుప్రీం ఫోకస్!

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు షాక్
- ముగ్గురు ఈసీల నియామకాలకు సవాల్
- కో వారెంట్ రిట్ కోసం పిటిషన్
- నియామకాలు చట్టబద్ధమేనా?
- 2023 చట్టం ఉల్లంఘించారంటూ ఆరోపణ
- ఈసీ ఏకపక్ష వైఖరిపై విమర్శలు
- సుప్రీం పిటిషన్‌తో దేశవ్యాప్తంగా ఉత్కంఠ

2 లో

# భారత్‌లో స్టార్‌లింక్‌కు బ్రేక్?

- మస్క్ సంచలన ఆరోపణలు
- కుబేరులే అడ్డుకుంటున్నారన్న మస్క్
- గుత్తాధిపత్యం కోసమే కుట్ర?
- స్పెక్ట్రమ్ కేటాయింపు ఇంకా పెండింగ్
- మస్క్ ట్వీట్‌పై కేటీఆర్ రియాక్షన్
- కుబేరుల పేర్లు బయటపెట్టాలన్న కేటీఆర్




**న్యూస్ డెస్క్, 08 అక్టోబర్ (బిఎన్ఎస్):** భారతదేశంలో తన శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు స్టార్‌లింక్ ప్రవేశాన్ని కొందరు అపార సంపన్నులు కావాలనే అడ్డుకుంటున్నారని స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఎక్స్ వేదికగా ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం టెలికాం, వ్యాపార వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. భారతదేశంలోని ప్రజలకు ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ సేవలు అందకుండా చేసి, తమ గుత్తాధిపత్యాన్ని కాపాడుకోవడానికే కొందరు దిగ్గజాలు తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నారని మస్క్ మండిపడ్డారు. ఆ దిగ్గజాలు ఎవరో ప్రజలే సులభంగా ఊహించుకోవచ్చంటూ కామెంట్ చేసిన ఆయన.. భారత్‌లో స్టార్‌లింక్ రాకపోకలను నిలిపివేయడం అక్కడి ప్రజలకు చేస్తున్న నేరంతో సమానమని ఘాటుగా స్పందించారు.

2 లో

# 'సేవ్ డెమోక్రసీ' ర్యాలీలో ఉద్రిక్తత!

**న్యూస్ డెస్క్, 08 అక్టోబర్ (బిఎన్ఎస్):** దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయంగా 'సేవ్ డెమోక్రసీ' పేరుతో ఇండీ కూటమి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో చేపట్టిన 'చలో లోక్‌భవన్' కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. నెక్లెస్ రోడ్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం ప్రారంభ ప్రాంతం నుంచి లోక్ భవన్ వరకు కూటమి నేతలు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసన ప్రదర్శనలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అజారుద్దీన్, శ్రీధర్ బాబు. పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, తదితర ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని కూటమి నేతలు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేస్తూ వారు ముందుకు కదిలారు.

2 లో

# కేటీఆర్‌కు దానం ఓపెన్ ఛాలెంజ్!

- హైదరాబాద్‌లో 'సేవ్ డెమోక్రసీ' ర్యాలీ
- లోక్‌భవన్ వద్ద ఉద్రిక్తత
- సీఈసీ రాజీనామాకు డిమాండ్
- నేతలను అడ్డుకున్న పోలీసులు
- బారికేడ్ల వద్ద తీవ్ర వాగ్వాదం
- రోడ్డుపై బైఠాయించిన మంత్రులు
- ఢిల్లీలో ఇండీ కూటమి కీలక భేటీ

2 లో

# ఎన్నికల కమిషన్‌పై సుప్రీం ఫోకస్!



న్యూస్ డెస్క్, 08 అక్టోబర్ (బిఎన్ఎస్): చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిల నియామకాలను సవాల్ చేస్తూ గురువారం దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలైంది. సూరి పయల అనే పిటిషనర్ రాజ్యాంగంలోని ఆర్టికల్-32 కింద ఈ పిటిషన్‌ను అత్యున్నత ధర్మాసనం ముందుంచారు. ఈ పిటిషన్‌లో భాగంగా జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషులు ఏ అధికారంతో ఆ అత్యున్నత పదవులను నిర్వహిస్తున్నారో వివరించేలా కో వారెంట్ రిట్‌ను జారీ చేయాలని పిటిషనర్ కోరారు. ఒకవేళ వారి నియామకాలు చట్టబద్ధమైన అధికారానికి లోబడి లేకపోతే ఆ పదవులు ఖాళీగా ఉన్నట్లుగా ప్రకటించాలని ఆయన అభ్యర్థించారు.

అదేవిధంగా 2024 మార్చి 14న జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధులను ఎన్నికల కమిషనర్లుగా నియమిస్తూ జారీ చేసిన నోటిఫికేషన్ల పాటు 2025 ఫిబ్రవరి 17న జ్ఞానేశ్ కుమార్‌ను సీఈసీగా పదోన్నతి కల్పిస్తూ, వివేక్ జోషిని ఈసీగా నియమిస్తూ ఇచ్చిన నోటిఫికేషన్లను ఈ పిటిషన్ల ద్వారా సవాల్ చేశారు. 2023 నాటి చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల చట్టంలోని నిబంధనలను సరిగ్గా పాటించకుండానే ఈ నియామకాలు చేపట్టారని పిటిషన్‌లో తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఎలక్షన్ కమిషన్‌ను ఏకపక్షంగా నడుపుతున్నారంటూ పిటిషన్‌లో పేర్కొన్నారు. అదేవిధంగా అదేవిధంగా ఎలక్షన్ కమిషన్‌ను ఏకపక్షంగా నడుపుతున్నారంటూ పిటిషనర్ ఆరోపణలు ప్రస్తుతం ఎన్నికల సంఘం తీరుపై దేశవ్యాప్తంగా ఇండీ కూటమి, కాక్రోచ్ జనతా పార్టీతో పాటు వివిధ వర్గాల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్న తరుణంలో తాజాగా సుప్రీంకోర్టు పిటిషన్ అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది.

# కేటీఆర్‌కు దానం ఓపెన్ ఛాలెంజ్!



న్యూస్ డెస్క్, 08 అక్టోబర్ (బిఎన్ఎస్): ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉప ఎన్నిక నేపథ్యంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన సవాల్ విసిరారు. గురువారం ఇండీ కూటమి చేపట్టిన 'సేవ్ డెమోక్రసీ' ర్యాలీలో పాల్గొన్న దానం మాట్లాడుతూ.. ఖైరతాబాద్‌లో తనపై బరిలోకి దిగి పోటీ చేయాలని కేటీఆర్‌కు ఆయన ఓపెన్ ఛాలెంజ్ చేశారు. బై ఎలెక్షన్‌కు తాను పూర్తిగా సిద్ధంగా ఉన్నానని, ఈ పోరులో తాడోపేడో తేల్చుకుందామని కామెంట్ చేశారు. దానం నాగేందర్ అంటేనే ఓ బ్రాండ్ అని ధీమా వ్యక్తం చేశారు. ఖైరతాబాద్ ఉప ఎన్నిక తమ ప్రభుత్వ పాలనకు రెఫరెండం కాబోతోందని పేర్కొన్నారు.

ఈసీ, సీఈసీ తీరుపై మండిపాటు..

దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ విధానానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలపై దానం నాగేందర్ స్పందించారు. ఈ నిరసనల్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఒక్కరే కాకుండా, ఇండీ కూటమి ఎంపీలు, యువత పెద్దఎత్తున కలిసి వస్తున్నారని తెలిపారు. ప్రజల ఓటు హక్కును కాలరాసే అధికారం ఎవరికీ లేదని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు ఆ అధికారం ఎవరిచ్చారంటూ ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఖైరతాబద్ ఉపఎన్నికలో విజయం సాధించి తీరుతామని, ఈ ఎన్నిక ద్వారా ప్రత్యర్థులకు తగిన గుణపాఠం చెబుతామని దానం నాగేందర్ స్పష్టం చేశారు.

# 'సేవ్ డెమోక్రసీ' ర్యాలీలో ఉద్రిక్తత!



న్యూస్ డెస్క్, 08 అక్టోబర్ (బిఎన్ఎస్): దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయంగా 'సేవ్ డెమోక్రసీ' పేరుతో ఇండీ కూటమి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో చేపట్టిన 'చలో లోక్‌భవన్' కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. నెక్లెస్ రోడ్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం ప్రారంభ ప్రాంతం నుంచి లోక్ భవన్ వరకు కూటమి నేతలు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసన ప్రదర్శనలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అజారుద్దీన్, శ్రీధర్ బాబు. పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, తదితర ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని కూటమి నేతలు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేస్తూ వారు ముందుకు కదిలారు.

పోలీసుల అడ్డగింత.. వాగ్వాదం

కూటమి నేతల ర్యాలీ లోక్‌భవన్ వద్దకు చేరుకునేసరికి భద్రతా కారణాల దృష్ట్యా పోలీసులు అప్రమత్తమయ్యారు. భారీ బారికేడ్లను ఏర్పాటు చేసి నేతలను ముందుకు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, ఇండీ కూటమి నేతలకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి, అక్కడ కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో మంత్రులు పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, వేం నరేందర్ రెడ్డి లోక్ భవన్ ఎదుట నడిరోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్నారు. అనంతరం వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని డీసీఎంలోకి ఎక్కించి సమీప పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఢిల్లీలో ఇండీ కూటమి కీలక విందు భేటీ

మరోవైపు, ఈ పరిణామాల నేపథ్యంలో నేషనల్ కేపిటల్ ఢిల్లీలో రాజకీయ వేడెక్కనుంది. ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ ప్రాంతంలోని ఓ ప్రముఖ హోటల్‌లో ఇండీ కూటమి నేతల కోసం ప్రత్యేక విందు భేటీ జరగనుంది. ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఈ విందుకు కూటమి నేతలకు ఆహ్వానం పంపారు. వివిధ పార్టీల అధినేతలు, కూటమి పార్టీల ఎంపీలు అందరూ ఈ విందుకు హాజరుకావాలని ఆయన ప్రత్యేక సందేశం పంపారు. ఈ విందు సమావేశం అనంతరం ఇవాళ్టి రాజకీయ కార్యాచరణను అమలు చేసేలా తుది నిర్ణయం తీసుకోనున్నారు.

# భారత్‌లో స్టార్‌లింక్‌కు బ్రేక్?

మొదటి పేజీ తరువాయి

ఇంకా పెండింగ్‌లోనే క్లియరెన్స్‌లు..




భారత్‌లో సేవలు అందించేందుకు స్టార్‌లింక్ సంస్థ అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నప్పటికీ, భద్రతాపరమైన క్లియరెన్స్‌లు, స్పెక్ట్రమ్ కేటాయింపులు ఇంకా తుది దశకు చేరుకోలేదు. తమ వైపు నుంచి అన్ని అనుమతులకు సిద్ధంగా ఉన్నా, కొందరి స్వార్థ ప్రయోజనాల వల్ల ఈ ప్రక్రియలో విపరీతమైన జాప్యం జరుగుతోందని మస్క్ ఆరోపించారు. భారతీయ టెలికాం మార్కెట్లో శాటిలైట్ కమ్యూనికేషన్ సేవలు ప్రారంభం కానున్న కీలక తరుణంలో ఎలాన్ మస్క్ చేసిన ఈ తాజా వ్యాఖ్యలు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి.

మస్క్ ట్వీట్‌పై స్పందించిన కేటీఆర్..

అయితే, ఎలాన్ మస్క్ చేసిన ట్వీట్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రియాక్ట్ అయ్యారు. భారత్‌లోకి స్టార్ లింక్ రాకుండా కేంద్ర ప్రభుత్వంపై ఎవరు పట్టు బిగించారో దేశం తెలుసుకోవాలని అన్నారు. ఆ కుబేరుల పేర్లను మస్క్ బయటపెట్టాలని కేటీఆర్ కామెంట్ చేశారు.

# దేశమంతా 5జీ నెట్‌వర్క్!

మొదటి పేజీ తరువాయి

2023లో 5జి సేవలను విస్తరించడంపై దృష్టి పెట్టగా నేడు దేశంలోని ప్రతి జిల్లాకూ 5జి నెట్‌వర్క్ చేరుకుందని చెప్పారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 5.5 లక్షలకు పైగా బేస్ స్టేషన్లు పనిచేస్తున్నాయని 2022తో పోలిస్తే ప్రస్తుతం మొబైల్ ఇంటర్నెట్ వేగం 10 రెట్లు పెరిగిందని ప్రధాని వెల్లడించారు. దేశం 5జీ రీచ్‌అవుట్ భవిష్యత్తు వైపు ముందుకు సాగుతోందని తెలిపారు. గత దశాబ్దంలో దేశవ్యాప్తంగా టెలికాం మౌలిక వసతులు గణనీయంగా విస్తరించాయని ప్రధాని తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో మొబైల్ టవర్ల ఏర్పాటు, ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ విస్తరణ, డేటా ధరలు అందుబాటులోకి రావడం వంటి పరిణామాలను ప్రస్తావించారు. ఈ విస్తరణతో ఆర్థిక వ్యవస్థలో కొత్త రంగాలు పుట్టుకొచ్చాయని, టెక్నాలజీ, వినోదం, విద్య రంగాల్లో వినియోగదారుల సంఖ్య పెరిగిందని చెప్పారు. కొత్త తరం కంటెంట్ క్రియేటర్లకు కూడా ఇది అవకాశాలను కల్పించిందన్నారు.

రూ.50 లక్షల కోట్ల నేరుగా బదిలీ:

డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా లబ్ధిదారుల మొబైల్ ఫోన్లతో అనుసంధానమైన బ్యాంకు ఖాతాలకు రూ.50 లక్షల కోట్ల నిధులు చేరాయని మోడీ ఈ సందర్భంగా తెలిపారు. ఈ విధానం ద్వారా సుమారు రూ.5 లక్షల కోట్లు ఆదా చేసినట్లు చెప్పారు. నిధులు తప్పుడు చేతుల్లోకి వెళ్లకుండా అడ్డుకోవడం వల్ల ఈ ఆదా సాధ్యమైందని పేర్కొన్నారు. ప్రభుత్వ సేవలు, పథకాల కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గిందని, తక్కువ ప్రయాణం, తక్కువ నిరీక్షణ, తక్కువ ఖర్చుతో పాటు ప్రజలకు మరింత సౌకర్యం కలుగుతోందని వివరించారు. పీఎం-కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద ఇప్పటివరకు రూ.4 లక్షల కోట్లకు పైగా నిధులను రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా బదిలీ చేసినట్లు మోడీ తెలిపారు. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి ఈ మొత్తాన్ని బదిలీ చేస్తున్నామని, నగదు జమ అయిన వెంటనే రైతుల మొబైల్ ఫోన్లకు నోటిఫికేషన్ వస్తుందని చెప్పారు. గతంలో ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందలేకపోయిన కోట్లాది మంది చిన్న రైతులకు కూడా ఇప్పుడు నిధులు నేరుగా చేరుతున్నాయని పేర్కొన్నారు.

మొబైల్‌లో గేమింగ్.. క్రియేషన్ స్టూడియో

భారత్‌లో 50 కోట్ల మందికి పైగా ప్రజలు ఏదో ఒక రూపంలో గేమింగ్‌తో అనుసంధానమై ఉన్నారని మోడీ పేర్కొన్నారు. వీరిలో ఎక్కువ మంది యువతేనన్నారు. టైర్-2, టైర్-3 నగరాలకు చెందిన యువత గేమింగ్, ఈ-స్పోర్ట్స్, గేమింగ్ కంటెంట్ క్రియేషన్, కొత్త గేమింగ్ వ్యాపారాల్లో పాల్గొంటున్నారని తెలిపారు. భారత్‌లో మొబైల్ ఫోన్ ఇప్పుడు గేమింగ్ కన్సోల్‌తో పాటు క్రియేషన్ స్టూడియోగా కూడా మారిందన్నారు.

# ఏపీకి కేంద్రం షాక్.. 3.71 లక్షల ఇళ్లు రద్దు!

మొదటి పేజీ తరువాయి

అయితే, అనూహ్య నిర్ణయం రాష్ట్రంలో తీవ్ర కలకలం రేపుతోంది. పీఎంఏవై అర్బన్ 1.0 పథకం గడువు వాస్తవానికి 2024 డిసెంబర్‌తో ముగియాల్సి ఉంది. కానీ, రాష్ట్రాల విజ్ఞప్తి మేరకు కేంద్రం ఈ గడువును ఇప్పటికే రెండుసార్లు పొడిగించింది. అయినప్పటికీ, నిర్దేశిత తుది గడువైన 2026 జులై నాటికి కూడా క్షేత్రస్థాయిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో కేంద్రం ఈ గృహాలను రద్దు చేస్తున్నట్లుగా స్పష్టం చేసింది.

ఏపీ ప్రభుత్వం స్పెషల్ రిక్వెస్ట్..

కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో అప్రమత్తమైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రద్దు చేసిన ఇళ్లపై పున:పరిశీలన కోరుతూ కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. రాష్ట్రంలో జియో ట్యాగింగ్ పూర్తయిన 1.27 లక్షల ఇళ్లను తిరిగి పునరుద్ధరించాలని ఏపీ ప్రభుత్వం కోరింది. మిగిలిన గృహాలను నూతనంగా అమల్లోకి వచ్చిన పీఎంఏవై-2.0 పథకంలోకి మార్చాలని కేంద్రానికి విన్నవించినట్లుగా తెలుస్తోంది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం ఎలా స్పందిస్తుందనేది ప్రస్తుతం రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది.

# ఓటర్ల జాబితాకు తుది మెరుగులు!




న్యూస్ డెస్క్, 08 అక్టోబర్ (బిఎన్ఎస్): తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ వేగంగా ముగింపు దశకు చేరుకుంటోంది. రాష్ట్రంలో ఎస్ఐఆర్ నోటీసులు అందుకున్న ఓటర్లలో ఏకంగా 76 శాతం మంది ఎలాంటి అవాంతరాలు లేకుండా తుది జాబితాకు అర్హత సాధించారు.

71 లక్షలకు పైగా ఓటర్లకు అర్హత..

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు మొత్తం 91,92,625 మంది ఓటర్లకు ఎస్ఐఆర్ నోటీసులు జారీ చేసినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయం ప్రకటించింది. వీరిలో సరైన ధ్రువపత్రాలు సమర్పించి తుది జాబితాకు అర్హత పొందిన వారి సంఖ్య 71,23,526కి చేరింది. అర్హత సాధించిన వారుపోను, మిగతా సుమారు 20 లక్షల మంది ఓటర్లకు సంబంధించిన విచారణ ప్రక్రియ ఇంకా పూర్తి కావాల్సి ఉంది. అధికారులు ఈ ప్రక్రియను వేగవంతం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికీ మరో 95,555 మంది ఓటర్లకు సంబంధించి నోటీసులు జారీ చేయాల్సి ఉందని ఈసీ వర్గాలు వెల్లడించాయి. అయితే, ఆ ప్రక్రియ కూడా త్వరలోనే పూర్తి కానుంది.

# మద్యం షాపులపై అప్‌డేట్!

మొదటి పేజీ తరువాయి

ఈ పాలసీ ప్రకారం ఇప్పటికే కొనసాగుతున్న మద్యం దుకాణాల లైసెన్సులను పునరుద్ధరించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇందులో భాగంగానే 2,929 దుకాణాల లైసెన్సులు ఇప్పటికే పునరుద్ధరించబడ్డాయి. అక్టోబర్ 8న 517 దుకాణాల కేటాయింపు పూర్తయిన తర్వాత ఇంకా 290 దుకాణాలు మిగిలి ఉంటాయని ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్ తెలిపారు. ఈ మిగిలిన దుకాణాలకు విడిగా నోటిఫికేషన్ జారీ చేసి, తదుపరి కేటాయింపు ప్రక్రియ చేపడతామని వెల్లడించారు. ఇప్పటికే పనిచేయని దుకాణాలతో పాటు మిగిలిన దుకాణాలను కలిపి మొత్తం 807 దుకాణాలను లాటరీ విధానంలో కేటాయించేందుకు నోటిఫై చేసినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు. దీంతో రాష్ట్రంలో మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ దశలవారీగా కొనసాగుతోంది.

# స్థానిక ఎన్నికల్లో బీసీలకు లోకేష్ భరోసా!



న్యూస్ డెస్క్, 08 అక్టోబర్ (బిఎన్ఎస్): స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై క్లారిటీతో ఉన్నామని మంత్రి నారాలోకేష్ అన్నారు. మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో లోకేష్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో సత్తా చాటేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కోర్టు తీర్పు ఎలా ఉన్నా, పార్టీ పరంగా బీసీలకు 34 శాతం పైగా స్థానాలు కేటాయించి తీరుతామని చెప్పారు. టీడీపీ అంటేనే బీసీల పార్టీ అని, రిజర్వేషన్లు ఖరారు కాకుండా అభ్యర్థిని ప్రకటించిన ఘటన గొడ్డలి పార్టీకే దక్కిందని మండిపడ్డారు.

స్థానిక ఎన్నికల పట్ల ఆ పార్టీ ఎంత అవగాహనారాహిత్యంగా ఉందో ఇది చూస్తే అర్థం అవుతుందని చెప్పారు. బీసీ రిజర్వేషన్లను అడ్డుకునేందుకు వైసీపీ కుట్రలు చేస్తోందని, దీన్ని ప్రజలు గమనించాలని వ్యాఖ్యానించారు. ఓటమి భయంతో స్థానిక ఎన్నికలను అడ్డుకునేందుకు సుప్రీంకోర్టు వరకు వెళ్లారని మండిపడ్డారు. బీసీలకు రిజర్వేషన్లు దక్కకుండా వైసీపీ చేస్తున్న కుట్రలపై పోరాటంలో భాగంగా తాము సుప్రీంకోర్టు వరకు వెళ్లామని చెప్పారు. అంతేకాకుండా స్థానిక ఎన్నికల తరవాత నామినేటెడ్ పదవుల భర్తీపై సమీక్షిస్తామని స్పష్టం చేశారు. పనిచేసిన వారికే నామినేటెడ్ పదవుల రెన్యువల్ ఉంటుందని అన్నారు.

# చోరీ ఫిర్యాదు.. మధుమితపై కేసు!



న్యూస్ డెస్క్, 08 అక్టోబర్ (బిఎన్ఎస్): తమిళనాడు యూట్యూబర్ మధుమిత కేసులో ఊహించని ట్విస్ట్ చేసుకుంది. ఇటీవల మధుమిత తన ఇంట్లో ఉన్న డబ్బు, నగదు వీడియోలను సోషల్ మీడియాలో వ్లాగ్స్ చేయగా ఇంట్లోకి దొంగలు చొరబడి చోరీ చేశారు. దాదాపు 118 సవర్ల నగలు దుండగులు ఎత్తుకుపోయారని మధుమిత పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాగర్ కోవిల్ సమీపంలోని తమ్మత్తుక్కోణంలో తన నివాసంలో చోరీ జరిగిందని చెప్పారు. ప్రస్తుతం ఈ కేసుపై పోలీసులు విచారణ జరుపుతుండగా తాజాగా బిగ్ ట్విస్ట్ చోటు చేసుకుంది. తన వద్ద 5 సవర్ల బంగారు గొలుసును మధుమిత దోచుకుందని తిరునెల్వేలికి చెందిన ఓ కాంట్రాక్టర్ పోలీసులను ఆశ్రయించాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు మధుమితను విచారణకు రావాలని ఆహ్వానించగా ఆమె తన భర్త, కుమార్తెతో కలిసి ఇంటి నుండి పరార్ అయ్యారు.

మధుమిత కోసం పోలీసులు ఇంటికి వెళ్లగా ఇంటికి తాళం ఉండటం చూసి షాక్ అయ్యారు. ఫోన్ లోనూ ఆమె అందుబాటులో లేకపోవడంతో పరారీలో ఉన్నట్టు తెలుస్తోంది. ఇదిలా ఉంటే మధుమిత సోషల్ మీడియాలో ఎక్స్ పోజింగ్ చేస్తూ వీడియోలు చేసి ఫాలోవర్స్ ను పెంచుకున్నారు. ఫాలోవర్స్ పెరిగిన తరవాత ప్రమోషనల్ వీడియోలు చేస్తూ ఫుల్ గా సంపాదించారు. అలా సంపాదించిన డబ్బును గొప్పగా చెప్పుకుంటూ వీడియో తీయగా అది కాస్తా దొంగలపాలైంది. ఇక ఇప్పుడు ఆమెపై సైతం కేసు నమోదు కావడంతో కేసులో ఎలాంటి ట్విస్టులు చోటు చేసుకుంటాయన్నది ఆసక్తికరంగా మారింది.

# దసరా ప్రయాణికులకు ఆర్టీసీ బంపర్ ఆఫర్!

మొదటి పేజీ తరువాయి

ఏ జోన్ నుంచి ఎన్ని బస్సులంటే?

ప్రయాణికుల రాకపోకలకు వీలుగా జోన్ల వారీగా ప్రత్యేక బస్సులను ఆర్టీసీ విభజించింది. కరీంనగర్ జోన్ పరిధి నుంచి అత్యధికంగా 3,533 బస్సులను నడపనున్నారు. ఇందులో రీజియన్ల వారీగా చూస్తే ఆదిలాబాద్ నుంచి 431, నిజామాబాద్ నుంచి 719, కరీంనగర్ నుంచి 1,175, వరంగల్ నుంచి 530, ఖమ్మం నుంచి 678 బస్సులు అందుబాటులోకి రానున్నాయి. ఇక హైదరాబాద్ జోన్ నుంచి మొత్తం 2,155 ప్రత్యేక బస్సులు నడుస్తుండగా, రీజియన్ల వారీగా మహబూబ్ నగర్ నుంచి 645, మెదక్ నుంచి 255, నల్గొండ నుంచి 815, రంగారెడ్డి నుంచి 440 బస్సులను కేటాయించారు. ఇవే కాకుండా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రధాన బస్ స్టేషన్లు, పాయింట్ల నుంచి పండుగ కోసం ప్రత్యేకంగా మరో 1,312 ప్రత్యేక సర్వీసులను నడపాలని నిర్ణయించారు.

ప్రత్యేక బస్సుల్లో టికెట్ ధరల సవరణ

పండుగ రద్దీ సమయంలో నడిచే ఈ ప్రత్యేక బస్సులకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం టికెట్ ధరల్లో మార్పులు చేశారు. సాధారణ చార్జీలపై 1.5 రెట్ల వరకు ధరలను సవరిస్తున్నట్లు టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం స్పష్టం చేసింది. ప్రయాణికులు ముందస్తుగా తమ ప్రయాణాలను ప్లాన్ చేసుకుని, ఆర్టీసీ అందిస్తున్న ఈ ప్రత్యేక బస్సు సర్వీసులను వినియోగించుకోవాలని అధికారులు కోరారు.

# బతుకమ్మ పేరుతో బురిడీ!

మొదటి పేజీ తరువాయి

2025 ఏప్రిల్‌లో రవీంద్రభారతిలో నిర్వహించిన 892వ బసవ జయంతి వేడుకలకు సంబంధించిన అసలు వీడియో దృశ్యాలను తీసుకుని వాటికి ఏఐ ద్వారా రూపొందించిన డీప్‌ఫేక్ ఆడియోను జత చేసినట్లు గుర్తించారు. దీంతో సీఎం రెండు కొత్త హామీలను ప్రకటించినట్లుగా వీడియోను రూపొందించి సోషల్ మీడియాలో ప్రచారం చేసినట్లు ఫ్యాక్ట్‌చెక్ బృందం తెలిపింది. వైరల్ ఆడియోను ఏఐ డిటెక్షన్ పరికరాలతో పరిశీలించగా డీప్‌ఫేక్ ఆడియోగా గుర్తించినట్లు పేర్కొంది.

అయితే వైరల్ ప్రచారంలో ఉన్న రెండు అంశాల్లో ఒకటి మాత్రం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల్లో భాగంగా ఉన్నదే. తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా పేర్కొన్న ఆరు గ్యారంటీల్లో మహాలక్ష్మి పథకం కింద కుటుంబానికి పెద్దగా ఉన్న మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, రూ.500కే ఎల్పీజీ సిలిండర్, రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం వంటి హామీలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ అధికారిక పోర్టల్‌లో కూడా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2,500 ఆర్థిక సహాయం, రూ.500 గ్యాస్ సిలిండర్, ఉచిత బస్సు ప్రయాణం అంశాలు పేర్కొన్నాయి.

వేములవాడ నుంచి పోటీ చేస్తారా.. కల్వకుంట్ల కవిత ఆసక్తికర వ్యాఖ్యలు

మరోవైపు కల్యాణలక్ష్మి కింద రెండు తులాల బంగారం అందిస్తామని చెప్పడం ఆరు గ్యారంటీల్లో భాగం కాదు. కాకపోతే ఈ పథకం కింద తులం బంగారం ఇస్తామని ప్రకటించారు. ఆరు గ్యారంటీల అధికారిక జాబితాలో మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, యువ వికాసం, చేయూత ఉన్నాయి. ప్రభుత్వం కూడా ఈ ఆరు గ్యారంటీలను అధికారికంగా ఇదే విధంగా పేర్కొంది. కల్యాణలక్ష్మి/షాదీ ముబారక్ అనేది తెలంగాణలో ఇప్పటికే అమల్లో ఉన్న పథకం. ప్రభుత్వ పత్రాల ప్రకారం అర్హులైన కుటుంబాలకు వివాహ సమయంలో ఆర్థిక సాయం అందించే పథకంగా ఇది కొనసాగుతోంది. ఇటీవల ఈ పథకంపై హైకోర్టు స్టే విధించింది.

అందువల్ల వైరల్ వీడియోలోని రూ.2500 ప్రకటనను పూర్తిగా కొత్త హామీగా భావించడం తప్పు, ఎందుకంటే అది మహాలక్ష్మి ఆరు గ్యారంటీల్లోనే ఉంది. అయితే బతుకమ్మ నుంచి ప్రారంభిస్తామని, కల్యాణలక్ష్మి కింద రెండు తులాల బంగారం ఇస్తామని సీఎం ప్రకటించినట్లుగా ఉన్న వీడియో మాత్రం డీప్‌ఫేక్. సంక్షేమ పథకాల అమలు, కొత్త ప్రకటనలు, అర్హతలు, తేదీలకు సంబంధించిన సమాచారాన్ని సోషల్ మీడియా వీడియోలు, పోస్టుల ఆధారంగా కాకుండా తెలంగాణ ప్రభుత్వ అధికారిక ప్రకటనల ద్వారా మాత్రమే నిర్ధారించుకోవాలని ఫ్యాక్ట్‌చెక్ టీమ్ ప్రజలకు సూచించింది.

# రైతులకు బేడీలా?: హరీశ్ రావు ఫైర్!



న్యూస్ డెస్క్, 08 అక్టోబర్ (బిఎన్ఎస్): రేవంత్ పాలనలో రైతుల చేతులకు బేడీలు వేయడం, పోలీస్ స్టేషన్లలో కేసులు పెట్టడం పరిపాటిగా మారడం సిగ్గుచేటని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. ఇంజనీర్లతో రైతులపై కేసులు పెట్టించడం కాంగ్రెస్ ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. మీ చేతగాని తనం వల్ల ఈరోజు పంటలకు నీళ్లు అందక ఎండిపోతున్న దుస్థితి ఏర్పడిందని వాపోయారు. ఈ మేరకు తాజాగా గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. కడుపు మండిన రైతన్న రోడ్డెక్కి నిలదీస్తే అక్రమ కేసులు బనాయిస్తారా? పోలీసులను ప్రయోగించి భయభ్రాంతులకు గురి చేస్తారా? ఇదెక్కడి దుర్మార్గం? ఇదెక్కడి అన్యాయం? అని హరీశ్ రావు ప్రశ్నించారు.

కృష్ణాలో నీటి ప్రవాహాలు ఉన్నప్పుడు నీటిని లిఫ్ట్ చేయకుండా ఉద్దేశ్యపూర్వకంగా నిర్లక్ష్యం వహించింది మీరు.. నీళ్లను ఒడిసి పట్టకుండా, విడిచిపెట్టి తెలంగాణకు జల ద్రోహం చేసింది మీరంటూ కాంగ్రెస్ ప్రభుత్వంలోని నాయకులపై మాజీ మంత్రి హరీశ్ రావు విరుచుకుపడ్డారు. తప్పు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తే, శిక్ష రైతులు అనుభవించాలా? అని నిలదీశారు. సాగునీళ్లు లేక, కరెంట్ లేక రైతులు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తుంటే.. పరిష్కరించాల్సింది పోయి అక్రమ కేసులు పెడతారా? అని ప్రశ్నించారు. ఇది ప్రజా పాలననా? లేక ప్రజా పీడననా? రైతులపై పెట్టిన కేసులు వెంటనే ఉపసంహరించుకోవాలని బిఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. రైతు వ్యతిరేక చర్యలు ఇలాగే కొనసాగిస్తే, పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరిస్తున్నట్లు తెలిపారు.

# లాడ్జిల యజమానులు, మేనేజర్లకు కౌన్సెలింగ్: చందానగర్ పోలీసులు



చందానగర్: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని లాడ్జిల యజమానులు, మేనేజర్లతో పోలీసులు ప్రత్యేక కౌన్సెలింగ్ సమావేశం నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌కు పిలిపించిన లాడ్జిల నిర్వాహకులకు లాడ్జిల సక్రమ నిర్వహణ, నేరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

గుర్తింపు పత్రాలు తప్పనిసరి:

లాడ్జిలలో బస చేసేందుకు వచ్చే ప్రతి ఒక్కరి గుర్తింపు పత్రాలను తప్పనిసరిగా క్షుణ్ణంగా పరిశీలించాలని పోలీసులు స్పష్టం చేశారు. వారి పూర్తి వివరాలను రిజిస్టర్లలో నమోదు చేసుకోవాలని ఆదేశించారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, వారి కార్యకలాపాలు సందేహాస్పదంగా అనిపించినా తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

సిసిటీవీ కెమెరాల నిరంతర నిఘా:

లాడ్జి ప్రాంగణాల్లో ఏర్పాటు చేసిన సిసిటీవీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని పోలీసులు నిర్వాహకులకు ఆదేశించారు. లాడ్జిలోని అన్ని ముఖ్యమైన ప్రాంతాలు కవర్ అయ్యేలా కెమెరాలను అమర్చాలని, సంబంధిత ఫుటేజీని భద్రపరచడం చాలా ముఖ్యమని తేల్చిచెప్పారు.

అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా జాగ్రత్తలు:

మైనర్లకు, అనుమానాస్పద వ్యక్తులకు నిబంధనలకు విరుద్ధంగా గదులు కేటాయించవద్దని పోలీసులు హెచ్చరించారు. లాడ్జిలు మాదకద్రవ్యాల (డ్రగ్స్) వినియోగం, వ్యభిచారం మరియు ఇతర ఎలాంటి అసాంఘిక, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు వేదికగా మారకుండా యజమానులు, మేనేజర్లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు:

సమాజంలో నేరాల నియంత్రణకు లాడ్జిల యాజమాన్యాలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఒకవేళ నిబంధనలను ఉల్లంఘించి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా లేదా సహకరించినా సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# తప్పిపోయిన ఆరేళ్ల బాలుడిని గంటల్లోనే తండ్రి చెంతకు చేర్చిన రాయదుర్గం పోలీసులు




రాయదుర్గం, అక్టోబర్ 8: రోడ్డుపై ఒంటరిగా తిరుగుతున్న ఆరేళ్ల బాలుడిని రాయదుర్గం పోలీసులు గుర్తించి, అతడి తల్లిదండ్రులను గాలించి సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసుల చొరవతో బాలుడు క్షేమంగా తండ్రి చెంతకు చేరాడు.

గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో కేజీఎన్ జెరాక్స్ ఎదురుగా బాలుడు ఒంటరిగా తిరుగుతున్నట్లు డయల్-112కు సమాచారం అందింది. వెంటనే పోలీస్‌స్టేషన్ పెట్రోల్-2 సిబ్బంది హెచ్‌సీ జి.అన్నద్, ఏఆర్ పీసీ కె.అశోక్ అక్కడికి చేరుకుని బాలుడిని సురక్షితంగా రక్షించి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు.

ఎస్సై/ఎస్‌హెచ్‌ఓ ఆదేశాల మేరకు బాలుడి వివరాలు తెలుసుకునేందుకు పోలీసులు పరిసర ప్రాంతాల్లో విచారణ చేపట్టారు. గచ్చిబౌలి ఎక్స్ రోడ్డు పరిసరాల్లో ఆరా తీస్తూ బాలుడి తల్లిదండ్రుల కోసం గాలింపు చేపట్టారు. చివరకు సాయంత్రం 6 గంటల సమయంలో గచ్చిబౌలి ఇందిరానగర్‌లో బాలుడి తండ్రి ముకేష్‌ను గుర్తించారు.

# ఖైదీకి గోల్డ్ మెడల్.. బీఏలో అత్యధిక మార్కులతో రికార్డు

## జైలు నుంచే ఉన్నత విద్య.. ఎన్. సురేష్ ప్రతిభకు అరుదైన గుర్తింపు




రాజమండ్రి (బిఎన్ఎస్)అక్టోబర్ 8: జైలు జీవితం తన లక్ష్యానికి అడ్డంకి కాదని నిరూపిస్తూ కేంద్ర కారాగారం, రాజమహేంద్రవరంలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీ ఎన్. సురేష్ శిక్ష అనుభవిస్తున్నప్పటికీ విద్యపై ఆసక్తి, పట్టుదలతో విద్యారంగంలో అరుదైన ఘనత సాధించారు. డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నిర్వహించిన బీఏ కోర్సులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల పరిధిలో అత్యధిక సమగ్ర మార్కులు సాధించి ప్రతిష్ఠాత్మక ప్రతిభా గోల్డ్ మెడల్‌తో పాటు బుక్ ప్రైజ్ను అందుకున్నారు.

హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ క్యాంపస్ ఆడిటోరియంలో నిర్వహించారు.కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా ఎన్. సురేష్ గోల్డ్ మెడల్, బుక్ ప్రైజ్ అందుకున్నారు.

ఉన్నత విద్యను కొనసాగించి అత్యుత్తమ ఫలితాలు సాధించడం ద్వారా ఎన్. సురేష్ ఇతర ఖైదీలకు స్ఫూర్తిగా నిలిచారు. పరిస్థితులు ఎలా ఉన్నా విద్య ద్వారా జీవితంలో మార్పు సాధించవచ్చని ఆయన నిరూపించారు.

ఈ సందర్భంగా కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ డా. వి. సన్యాసిరావు మాట్లాడుతూ ఖైదీలలో విద్య, నైపుణ్యాభివృద్ధి, వ్యక్తిత్వ వికాసాన్ని ప్రోత్సహించడం ద్వారా వారిలో సానుకూల మార్పు తీసుకురావడానికి కారాగార శాఖ కృషి చేస్తోందన్నారు. ఎన్. సురేష్ సాధించిన గోల్డ్ మెడల్ ఆ కృషికి నిదర్శనమని పేర్కొన్నారు.

సురేష్ ఈ స్థాయిలో ప్రతిభ కనబర్చేందుకు సహకరించిన డీజీ, ఐజీ, డీఐజీ అధికారులకు, అప్పటి సూపరింటెండెంట్ ఎస్. రాహుల్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# దసరా మండపాలకు ఉచిత విద్యుత్ - రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

అమరావతి (బిఎన్ఎస్ )అక్టోబర్ 8: దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసే దసరా మండపాలకు ఉచిత విద్యుత్ అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు.

పోలీసుల అనుమతితో ఏర్పాటు చేసిన అధీకృత దసరా మండపాలకు ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు.

గ్రామాల్లో అయితే 3 కిలోవాట్లు, పట్టణాల్లో అయితే 5 కిలోవాట్లు వరకు ఉచిత విద్యుత్ ను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని ప్రకటించారు. 2026 దసరా ఉత్సవాలకు ఈ నిర్ణయం అమలులో ఉంటుందని పేర్కొన్నారు.

మా దుర్గామాత ఉత్సవాలను ప్రజలంతా కలిసి ఆనందంగా జరుపుకునేందుకు ప్రభుత్వం తన వంతుగా ఈ సహకారం అందిస్తోందని, అందరికీ ఆనందకరమైన, దివ్యమైన వేడుకలు జరగాలని ఆకాంక్షిస్తున్నామని నారా లోకేశ్ తెలిపారు.

దసరా మండపాల నిర్వాహకులకు ఇది గుడ్ న్యూస్ అంటూ ఆయన చేసిన పోస్ట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది.

# దసరా నేపథ్యంలో బస్సు టికెట్ ధరలు పెంచితే కఠిన చర్యలు

## -- జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు



అమలాపురం(బిఎన్ఎస్)అక్టోబర్ 8: దసరా పండుగ నేపథ్యంలో ప్రయాణికుల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేస్తూ బస్సులు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు హెచ్చరించారు. గురువారం ఉదయం అమలాపురంలోని జిల్లా రవాణా అధికారి కార్యాలయంలో ప్రైవేట్ బస్సుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికుల భద్రత, నిబంధనల అమలుపై పలు సూచనలు చేశారు.దసరా సందర్భంగా బస్సు టికెట్ ధరలను పెంచి ప్రయాణికుల నుంచి అధిక మొత్తాలు వసూలు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బస్సు బయలుదేరే ప్రదేశంలోనే డ్రైవర్లకు డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు జాతీయ రహదారులపై నిబంధనలకు విరుద్ధంగా బస్సులను పార్కింగ్ చేస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ రవాణా నిబంధనలను ప్రతి ప్రైవేట్ బస్సు యజమాని, డ్రైవర్ తప్పనిసరిగా పాటించాలని డీటీఓ సూచించారు.ఈ సమావేశంలో మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, సురేష్ కుమార్, కౌశిక్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 'మీ ప్రమాణం' యాప్‌తో

# ఉద్యోగుల హాజరు తప్పనిసరి

- ముఖగుర్తింపుతో పారదర్శక హాజరు నమోదు
- ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం: అదనపు కలెక్టర్ మహేందర్ జి




**బిఎన్ఎస్ ములుగు, అక్టోబర్ 08:**

ప్రభుత్వ ఉద్యోగుల సమయపాలన, పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు ప్రవేశపెట్టిన 'మీ ప్రమాణం' యాప్ ద్వారా అధికారులు, సిబ్బంది హాజరు నమోదు చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్. మహేందర్ జి సూచించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో వివిధ శాఖల నోడల్ అధికారులు, ఉద్యోగులకు 'మీ ప్రమాణం' యాప్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యాప్‌లో ఉద్యోగుల వివరాల నమోదు, ముఖగుర్తింపుతో హాజరు నమోదు, కార్యాలయ స్థాన నిర్ధారణ తదితర అంశాలను వివరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులు కార్యాలయ వేళల్లో సమయపాలన పాటిస్తూ ప్రజలకు ప్రభుత్వ సేవలను సకాలంలో అందించాలని సూచించారు. రెగ్యులర్, కాంట్రాక్టు, పొరుగు సేవల ఉద్యోగుల వివరాలను సంబంధిత నోడల్ అధికారులు త్వరితగతిన నమోదు చేయాలని ఆదేశించారు. ముఖగుర్తింపు, కార్యాలయ స్థాన నిర్ధారణ ద్వారా ఇతరుల తరఫున హాజరు నమోదు చేయడాన్ని నివారించవచ్చని తెలిపారు. యాప్‌లో సాంకేతిక సమస్యలు ఎదురైతే సంబంధిత నోడల్ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సందేహాల నివృత్తికి జిల్లా నోడల్ అధికారి ఈడీఎం దేవేందర్‌ను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఐటీడీఏ ఎస్‌డీసీ ప్రతాప్, ఈడీఎం దేవేందర్, హైదరాబాద్ సాంకేతిక బృందం ప్రతినిధులు, జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## 33 ఏళ్లగా మా పట్టా భూమిని మేమే దున్నుకుంటున్నం...

# అయితే వెబ్ ల్యాండ్ నందు ప్రభుత్వ భూమిట..!!

**మాకు న్యాయం చేయండి అంటూ జమ్మలమడుగు రెవిన్యూ డివిజనల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసిన వికలాంగ చింతల రామసుబ్బయ్య కుటుంబం..**



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 08 గడిచిన 33 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న పట్టా భూమి తమ దేనంటూ పట్టాదారు పాసు పుస్తకాలు చూపిస్తూ... గురువారం జమ్మలమడుగు ఆర్డిఓ కార్యాలయం ముందర నిరసన వ్యక్తం చేశారు. రీ సర్వేలో భాగంగా రెవిన్యూ రికార్డుల నందు వెబ్ ల్యాండ్ పోర్టల్ లో ప్రభుత్వ భూమిగా నమోదు కావడంతో తమకు అన్యాయం జరిగిందంటూ వికలాంగుడైన చింతల రామసుబ్బయ్య కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. మా భూమిపై మా గ్రామానికి చెందిన అగ్రవర్ణ కులాలవారు హక్కు కోరుతున్నారని ఆరోపిస్తూ.. న్యాయం చేయాలంటూ బాధిత కుటుంబ సభ్యులు జమ్మలమడుగు రెవిన్యూ డివిజనల్ కార్యాలయ అధికారులను ఆశ్రయించారు. కడపజిల్లా.. రాజుపాలెం మండలం, తొండలదిన్నె గ్రామం, ఏర్వపాలెం పంచాయతీకి చెందిన చింతల రామ సుబ్బయ్య కుటుంబం ఈ మేరకు జమ్మలమడుగు రెవిన్యూ డివిజనల్ కార్యాలయంలోని ఏఓ అక్బుల్ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దళితుడైన చింతల రామసుబ్బయ్య మీడియాతో మాట్లాడుతూ... రాజుపాలెం మండలం చిన్న జొన్నవరం పొలంలో 14-1 సర్వే నంబర్‌లో 1.40 సెంట్ల భూమి, 14 - 1ఏ సర్వే నంబర్‌లో 1.86 సెంట్ల గల పట్టా భూమి గత 33 ఏళ్ల క్రితం కొనుగోలు చేశానని అప్పటినుండి అధికారికంగా మాకు ఉందని తెలిపారు. ఈ భూమికి సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకాలు కూడా తమ వద్ద ఉన్నాయని తెలియజేశారు. అయితే "రీ సర్వేలో" తమ భూమి వెబ్ లాండ్ నందు ప్రభుత్వ భూమిగా నమోదైందని, ఇదే అదునుగా భావించిన కొందరు అక్రమార్కులు మా భూమిని అక్రమ మార్కులకు ఇవ్వాలని అధికారులను కోరుతున్నారని ఆరోపించారు. మా భూమి విషయంలో ఇప్పటికే రాజుపాలెం మండల తహసీల్దార్, మరియు రాజుపాలెం పోలీసు అధికారులను ఆశ్రయించినా న్యాయం జరగలేదని వికలాంగుడైన రామసుబ్బయ్య తన ఆవేదనను మీడియా ముందు వ్యక్తం చేశారు. 33 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న తమ పట్టా భూమిపై హక్కులను కాపాడి, మా భూమి మాకు చెందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని బాధిత రామసుబ్బయ్య ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులైన చింతల ఓబులమ్మ, చింతల సుబ్బరాయుడు విజ్ఞప్తి చేసుకున్నారు.

# స్మశాన వాటికకు దారి లేదు..

# నడుములోతు నీటిలో శవయాత్ర!

- వెంగళరావుపేట గ్రామస్తులకు తప్పని నరకయాతన
- తక్షణమే రహదారి నిర్మించాలని గ్రామస్తుల విజ్ఞప్తి






**బిఎన్ఎస్ వెంకటాపురం (నూగూర్), అక్టోబర్ 08:**

ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఉప్పేడ్ వీరాపురం గ్రామపంచాయతీ పరిధిలోని వెంగళరావుపేటలో స్మశాన వాటికకు సరైన రహదారి లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గురువారం ఓ మృతదేహాన్ని అంత్యక్రియల కోసం తీసుకెళ్తుండగా నడుములోతు నీటిలో, బురదలో మోసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. స్మశాన వాటికకు రహదారి నిర్మించాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మానవత్వాన్ని ప్రశ్నించేలా ఉన్న ఈ పరిస్థితిపై అధికారులు వెంటనే స్పందించి, తాత్కాలికంగా దారి ఏర్పాటు చేయడంతో పాటు శాశ్వత రహదారిని నిర్మించాలని గ్రామస్తులు కోరారు.

# అగ్రిగోల్డ్ బాధితులకు మంచి రోజులు వచ్చాయి..!!

బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 08: కడప జిల్లా... అగ్రిగోల్డ్ బాధితులందరికీ తెలియజేస్తూ.. 09-10-2026 తేదీ నుండి కడప జిల్లా ఎస్.పీ. కార్యాలయం ముందు ఉన్న ఆర్ఎస్ఐ ఆఫీస్ నందు అగ్రిగోల్డ్ బాండ్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని, బాండ్లను మండలాల వారీగా స్వీకరించడం జరుగుతుంది. ముందుగా 09-10-2026 మరియు 10-10-2026 తేదీలలో సిద్దవటం మండలానికి చెందిన అగ్రిగోల్డ్ బాధితుల బాండ్లను స్వీకరించడం జరుగుతుందని ప్రకటన. మిగిలిన మండలాలకు సంబంధించిన బాండ్ల స్వీకరణ తేదీలను తదుపరి పత్రికా ప్రకటనలు మరియు సోషల్ మీడియా ద్వారా ముందుగా తెలియజేయడం జరుగుతుంది. కావున ఇతర మండలాలకు చెందిన బాధితులు తమకు కేటాయించిన తేదీ కోసం వేచి ఉండాలని సూచించడమైనది.

బాండ్ సమర్పించే సమయంలో తీసుకురావలసిన పత్రాలు:

1. ఒరిజినల్ అగ్రిగోల్డ్ బాండ్ -- పరిశీలన నిమిత్తం తప్పనిసరిగా తీసుకురావాలి.
2. ఒరిజినల్ బాండ్ యొక్క సెల్ఫ్ అటెస్టేడ్ కలర్ జిరాక్స్ కాపీ మరియు జిరాక్స్ కాపీ సమర్పించాలి. పరిశీలన అనంతరం ఒరిజినల్ బాండ్ తిరిగి ఇవ్వబడుతుంది.
3. బాండ్ దారుడి ఆధార్ కార్డ్ లేదా ఓటర్ ఐడి లేదా రేషన్ కార్డ్ లేదా ఇతర చెల్లుబాటు అయ్యే గుర్తింపు కార్డు.
4. నామినీ బాండ్ సమర్పిస్తున్నట్లయితే నామినీ యొక్క ఐడి ప్రూఫ్.
5. డిపాజిటర్ మరణించి ఉంటే డెత్ సర్టిఫికెట్.
6. బంధువు బాండ్ సమర్పిస్తున్నట్లయితే ప్రూఫ్ ఆఫ్ రిలేషన్షిప్ ఫ్యామిలీ సర్టిఫికెట్ ఇతర అధికారిక సంబంధిత పత్రాలు.
7. అవసరమైన సందర్భాల్లో ఆథరైజేషన్ లేదా పర్మిషన్ అఫిడవిట్ మరియు ఇతర సంబంధిత పత్రాలు.

# న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే సమ్మె ఉధృతం

## 23 రోజులుగా వీఆర్ఏల ఆందోళన..




కొత్తపేట(బిఎన్ఎస్)అక్టోబర్ :8తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏలు) చేపట్టిన సమ్మె 23వ రోజుకు చేరుకుంది. ఇంతకాలంగా ఆందోళన కొనసాగుతున్నా ప్రభుత్వం నుంచి స్పష్టమైన స్పందన లేకపోవడంతో వీఆర్ఏలు

ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించడం కష్టంగా మారిందని, తమ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

కొత్తపేట పాత బస్టాండ్ సెంటర్‌లో కొనసాగుతున్న నిరసనలో వీఆర్ఏలు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకులకు పే స్కేలు అమలు చేయాలని, నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్ఏలుగా నియమించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి 13 జిల్లాల్లో 20 వేల మందికి పైగా వీఆర్ఏలు గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థలో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.

ప్రస్తుతం తమకు నెలకు కేవలం రూ.10,500 మాత్రమే వేతనంగా అందుతోందని, 2018లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హయాంలో వేతనం రూ.10,500కు పెంచినప్పటి నుంచి ఇప్పటివరకు ఎలాంటి పెంపు లేదని పేర్కొన్నారు. ప్రస్తుత ధరల నేపథ్యంలో ఈ వేతనంతో కుటుంబాలను పోషించడం తీవ్ర ఇబ్బందిగా మారిందని రోజు వారి కూలీల కంటే తక్కువ జీతాలు ఉన్నా ప్రభుత్వం, ప్రజలకు మేము చేసే సేవ (పని)లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం పథకాలను ముందు్ండి నడిపిస్తున్నాము... కానీ మా కుటుంబం నడపటం రోజు రోజు కు భారంగా మారుతుందని విఆర్ఏ లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత రెండు సంవత్సరాలుగా తమ సమస్యలను పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదని తెలిపారు. దీంతో వీఆర్ఏల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు.

తెలంగాణ ప్రభుత్వం తరహాలో వీఆర్ఏలను క్రమబద్ధీకరించి పే స్కేలు అమలు చేయాలని వారు కోరారు. నామినీలుగా పనిచేస్తున్న వారందరినీ వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద వీఆర్ఏలుగా నియమించాలని, అర్హులైన వారికి 70 శాతం ప్రమోషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో మృతి చెందిన వీఆర్ఏల కుటుంబాల్లో అర్హులకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

రీసర్వేలు, ఎన్నికల విధులు, భూమిశిస్తు వసూళ్లు తదితర పనులతో పాటు కొత్త జిల్లాల ఏర్పాటు అనంతరం కార్యాలయాల్లో వాచ్‌మెన్ విధులు కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. తమ సేవలను ప్రభుత్వం గుర్తించి న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని వీఆర్ఏలు కోరారు.

# దసరాకి పూర్తి స్థాయిలో ఏర్పాట్లు







ఇంద్రకీలాద్రి : ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన జగన్మాత శ్రీ కనకదుర్గ అమ్మవారి సన్నిధిలో అక్టోబర్ 11వ తేదీ ఆదివారం నుండి ప్రారంభం కానున్న శ్రీ పరాభవ నామ సంవత్సర దసరా శరన్నవరాత్రి మహోత్సవాల నిర్వహణకు దేవస్థానం అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో బహుముఖ వ్యూహాన్ని సిద్ధం చేసి సర్వసన్నద్ధమైంది.

"సామాన్యభక్తుల సౌకర్యమే ప్రథమ ప్రాధాన్యత " లక్ష్యంతో చేపట్టిన సమగ్ర ఏర్పాట్లను దేవస్థాన కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ గురువారం ఒక అధికారిక ప్రకటన ద్వారా వెల్లడించారు.

1. దర్శన విధానం -- ఉచిత దర్శనమే ప్రధాన లక్ష్యం:

సామాన్య భక్తులకు ప్రాధాన్యం: ప్రభుత్వ నిర్ణయం మేరకు రూ. 100, రూ. 300, రూ. 500 దర్శన టికెట్లను పూర్తిగా రద్దు చేశాము. క్యూలైన్లలో వేచి ఉండే సామాన్య భక్తులందరికీ వేగవంతమైన ఉచిత దర్శనం కల్పించబడుతుంది.

రూ. 1,000 శీఘ్ర దర్శనం: ఎక్కువ సమయం క్యూలైన్లలో నిలబడలేని భక్తుల సౌకర్యార్థం రూ. 1,000 శీఘ్ర దర్శన సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చాము. అధికారిక పోర్టల్ మరియు 'మన మిత్ర' వాట్సాప్ ద్వారా టికెట్లు పొందిన భక్తులకు కుమ్మరిపాలెం సెంటర్ వద్ద గల టిటిడి స్థలం నుండి దేవస్థాన వాహనాల ద్వారా ఓం టర్నింగ్ వద్దకు చేరవేసి, ప్రత్యేక క్యూ మార్గంలో దర్శనంకు అనుమతిస్తారు.

పూజ టిక్కెట్లు గల భక్తులు పూజ అయిన తరువాత రథం సెంటర్ ఫ్లైఓవర్ క్రింద గల ఫుట్ బ్రిడ్జి (Foot Bridge) మీదుగా కాలువ ఒడ్డుకు చేర్చి, అక్కడ సిద్ధంగా ఉండే వాహనాల్లో కుమ్మరిపాలెం కేంద్రానికి చేరుకోవచ్చు.

ప్రోటోకాల్ వేళలు: వీఐపీ మరియు ప్రోటోకాల్ ప్రముఖులకు ఉదయం 06:00 నుండి 08:00 గంటల వరకు మాత్రమే అంతరాలయ దర్శనం ఉంటుంది. సాయంత్రం పంచహారతుల అనంతరం రద్దీ తీవ్రతను బట్టి రాత్రి 08:00 నుండి 10:00 గంటల మధ్య మరో విడత దర్శన ఏర్పాట్లు ఉంటాయి. ప్రోటోకాల్ ప్రముఖులు వారికి కేటాయించిన సమయాల్లోనే విచ్చేసి సహకరించాలి.

తొలి రోజు దర్శనాలు: ఉత్సవాల తొలి రోజైన అక్టోబర్ 11వ తేదీ ఆదివారం నాడు వేకువజామున శ్రీ కనకదుర్గ అమ్మవారికి శాస్త్రోక్తంగా విశేష స్నపనాభిషేకం, దివ్య అలంకార పూజలు నిర్వహించనున్నారు.

అభిషేక క్రతువులు ముగిసిన అనంతరం ఉదయం 08:00 గంటల నుండి భక్తులకు సర్వదర్శనం ప్రారంభమవుతుంది.

2. రద్దీ నియంత్రణ -- క్యూలైన్లు, హోల్డింగ్ కేంద్రాలు & ప్రత్యామ్నాయ ప్రణాళిక:

క్యూ మార్గం: ఉత్సవాల ప్రారంభం నుండి వినాయక టెంపుల్, కెనాల్ రోడ్డు, టోల్‌గేట్ మీదుగా భక్తులను అనుమతిస్తారు. రద్దీ పెరిగిన తర్వాత వన్ టౌన్ వినాయక గుడి నుంచే ప్రవేశం ఉంటుంది. వినాయక మందిరం నుండి సుమారు 1,650 మీటర్ల పొడవున క్యూలైన్లు నిర్మించారు. ఈ మార్గంలో ఒకేసారి 8,500 మంది వేచి ఉండవచ్చు.

వర్షాలు వస్తే ప్రత్యామ్నాయం: వర్షాలు లేదా అత్యవసర పరిస్థితులతో టోల్‌గేట్ మార్గాన్ని మూసివేయాల్సి వస్తే, భక్తులను కనకదుర్గానగర్ మీదుగా మహామండపం ర్యాంపునకు మళ్లించే ప్రత్యామ్నాయ ప్రణాళిక దేవస్థానం వద్ద సిద్ధంగా ఉంది. దీని ద్వారా అదనంగా మరో 500 మందితో కలిపి మొత్తం 9,000 మందిని నిలిపి ఉంచవచ్చు.

మూడు భారీ హోల్డింగ్ ప్రాంతాలు: దూరప్రాంతాల నుండి రైళ్లు, బస్సుల్లో వచ్చే భక్తుల కోసం సీతమ్మవారి పాదాల వద్ద, విద్యుత్ శాఖ--నగరపాలక సంస్థ కార్యాలయాల పరిసరాల్లో, పాత పూల మార్కెట్ ఖాళీ చేసిన రైల్వే స్థలంలో 3 హోల్డింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిని 70 కంపార్ట్‌మెంట్లుగా విభజించి, ఒకేసారి 18,000 మంది వేచి ఉండేలా తీర్చిదిద్దారు. ఇక్కడ 70 సీసీ కెమెరాలు, పెద్ద తెరలు, మైకులు ఏర్పాటు చేశారు. పోలీసులు, దేవస్థాన సిబ్బంది సమన్వయంతో భక్తులను విడతలవారీగా క్యూ మార్గంలోకి అనుమతిస్తారు.

నిరీక్షిస్తున్న భక్తులకు తాగునీరు, మజ్జిగ, బిస్కెట్లు, అల్పాహారం నిరంతరం అందిస్తారు.

3. భద్రతకు సాంకేతిక బలం -- రవాణా వ్యవస్థ:

బూమ్ బారియర్లు & తనిఖీలు: కొండపైకి అనుమతి లేని ప్రైవేటు వాహనాలు రాకుండా బూమ్ బారియర్లు ఏర్పాటు చేశారు. ఓం టర్నింగ్ వద్ద ముఖ గుర్తింపు (Facial Recognition), క్యూఆర్ కోడ్ ఆధారిత స్కానింగ్ వ్యవస్థ ద్వారా సిబ్బంది గుర్తింపు కార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి అనుమతిస్తారు.

రవాణా సౌకర్యం: భక్తుల కోసం 8 దేవస్థాన బస్సులతో పాటు మినీ బస్సులు, టెంపోలు నిరంతరం రాకపోకలు సాగిస్తాయి. దివ్యాంగులకు ఉచిత రవాణా వాహనాలు అందుబాటులో ఉంటాయి.

# నవంబర్ 15న చలో నల్లగొండ

## రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలి: జంగా రెడ్డి




**బిఎన్ఎస్ న్యూస్ జనగామ, అక్టోబర్ 8**

అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభల సందర్భంగా నవంబర్ 15న నల్లగొండలో నిర్వహించే భారీ ప్రదర్శన, బహిరంగ సభకు రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెసరుకాయల జంగా రెడ్డి పిలుపునిచ్చారు.జనగామ జిల్లా కేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య అధ్యక్షతన తెలంగాణ రైతు సంఘం జిల్లా సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జంగా రెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు."ఆత్మహత్యలు వద్దు--ఐక్యంగా పోరాడుదాం" అనే నినాదంతో రైతాంగం ముందుకు సాగాలని కోరారు.రైతులకు కనీస మద్దతు ధరల చట్టం, రుణ విమోచన చట్టం తీసుకురావాలని, రైతులు పండించిన అన్ని పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని, పండ్లు, కూరగాయలకు మద్దతు ధరలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. పత్తి, నూనెలపై దిగుమతి సుంకాలను పునరుద్ధరించాలని కోరారు.కౌలు రైతులకు రుణార్హత కార్డులు, ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని, సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి పంట రుణాలను మాఫీ చేయాలని అన్నారు.మిగులు భూములను భూమిలేని పేదలకు పంపిణీ చేయాలని, భూసేకరణ చట్టం--2013ను పటిష్టంగా అమలు చేయాలని, భూ భారతి చట్టాన్ని రైతులకు అనుకూలంగా సవరించాలని కోరారు.అటవీ హక్కుల చట్టం--2006 ప్రకారం అర్హులకు హక్కు పత్రాలు ఇవ్వాలని, సహకార సంస్థలను బలోపేతం చేయాలని, విద్యుత్ సవరణ బిల్లు--2025ను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.పంటల బీమా పథకాన్ని రైతులకు ప్రయోజనం కలిగేలా మార్చాలని, వీబీ--గ్రామ్‌జీ చట్టాన్ని రద్దు చేసి ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని కోరారు.50 ఏళ్లు నిండిన వ్యవసాయ కార్మికులు, పేద, మధ్యతరగతి రైతులకు నెలకు రూ.10 వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.కార్పొరేట్ సంస్థల దాడులను ప్రతిఘటిస్తూ రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు ఐక్యంగా ప్రజా ప్రత్యామ్నాయం కోసం పోరాడాలని జంగా రెడ్డి పిలుపునిచ్చారు.నవంబర్ 15న నల్లగొండలో జరిగే కార్యక్రమానికి జనగామ జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.సమావేశంలో జిల్లా కార్యదర్శి భూక్యా చందు నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు మంగ బీరయ్య, సహాయ కార్యదర్శులు బెల్లంకొండ వెంకటేష్, నక్క యాకయ్య, గండి అంజయ్య, రమావత్ మీట్యా నాయక్, జిల్లా కమిటీ సభ్యులు పొన్నాల రాజవ్వ, పయ్యముల భిక్షపతి, బోడ రాములు, లింగబోయిన కుమారస్వామి, మంద చంద్రమౌళి, కత్తుల రాజు తదితరులు పాల్గొన్నారు.

# పెసా నిబంధనలకు విరుద్ధంగా వీడీసీల ఏర్పాటుపై ఆర్టీఐ

- 25 గ్రామపంచాయతీల పనులు, నిధులపై పూర్తి వివరాలు ఇవ్వాలి
- గ్రామసభ తీర్మానం లేకుండా నిధుల వినియోగంపై విచారణ చేయాలి
-మన్యసీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ మంగపేట మండల అధ్యక్షుడు తాటి నాగరాజు డిమాండ్



**బిఎన్ఎస్ మంగపేట, అక్టోబర్ 8:**

మంగపేట మండలంలోని షెడ్యూల్ ఏరియా పరిధిలో ఉన్న 25 గ్రామపంచాయతీల్లో పెసా గ్రామసభ తీర్మానాలకు విరుద్ధంగా వీడీసీలు ఏర్పాటు చేసి పనులు చేపట్టినట్లయితే, వాటికి సంబంధించిన పూర్తి వివరాలను సమాచార హక్కు చట్టం--2005 ప్రకారం అందించాలని కోరుతూ మన్యసీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ మంగపేట మండల అధ్యక్షుడు తాటి నాగరాజు ఎంపీడీవో బద్రు నాయక్కు వినతి పత్రం అందజేశారు. ప్రతి గ్రామపంచాయతీలో వీడీసీ ఎప్పుడు ఏర్పాటు చేశారు, ఎవరి పేరుతో మంజూరు చేశారు, సంబంధిత పెసా గ్రామసభ ఎప్పుడు నిర్వహించారు, తీర్మానం నంబర్, మంజూరైన నిధులు, నిధుల విడుదల వివరాలతో పాటు ఇప్పటివరకు చేపట్టిన పనులు, వాటి వ్యయం, బిల్లులు, వౌచర్ల ప్రతులను గ్రామపంచాయతీ వారీగా అందించాలని కోరారు. పెసా చట్టం ప్రకారం గ్రామసభకు ఉన్న అధికారాలను గౌరవించాలని, గ్రామసభ తీర్మానం లేకుండా వీడీసీల ఏర్పాటు లేదా నిధుల వినియోగం జరిగి ఉంటే సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మన్యసీమ మండల ప్రధాన కార్యదర్శి కొమరం రవికుమార్, ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి తోలేం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కన్నెబోయిన గూడెం గ్రామ పంచాయతీకి అరుదైన గౌరవం

## టిబీ నిర్మూలనలో కృషికి ప్రశంసా పత్రం




**జనగామ, అక్టోబర్ 8 (బిఎన్ఎస్)**

టిబీ ముక్త్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా విశేష కృషి చేసినందుకు కన్నెబోయిన గూడెం గ్రామ పంచాయతీకి ప్రశంసా పత్రం లభించింది. గురువారం జనగామ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ చేతుల మీదుగా గ్రామ పంచాయతీకి ప్రశంసా పత్రాన్ని అందజేశారు.ఈ ప్రశంసా పత్రాన్ని కన్నెబోయిన గూడెం గ్రామ సర్పంచ్ బానోత్ రమేష్ నాయక్ అందుకున్నారు.కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.గ్రామాన్ని క్షయ వ్యాధి రహితంగా తీర్చిదిద్దేందుకు గ్రామ పాలకవర్గం, అధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు చేసిన కృషిని ఈ సందర్భంగా అభినందించారు. టిబీ నిర్మూలన కార్యక్రమానికి గ్రామ ప్రజలు అందించిన సహకారం కూడా ప్రశంసనీయం అని పేర్కొన్నారు.టిబీ రహిత గ్రామంగా కన్నెబోయిన గూడెంను తీర్చిదిద్దేందుకు సహకరించిన గ్రామ పాలకవర్గం, అధికార యంత్రాంగం, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలకు సర్పంచ్ బానోత్ రమేష్ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

# గ్రామాల విద్యుత్ సమస్యల పరిష్కారానికి సర్పంచుల వినతి

- విద్యుత్ శాఖ డీఈని కలిసిన ముళ్లకట్ట, చల్పాక సర్పంచులు
- గ్రామాల్లో కరెంటు సమస్యలు త్వరగా పరిష్కరిస్తామని డీఈ హామీ



**ఏటూరునాగారం, అక్టోబర్ 8,బిఎన్ఎస్:**

ఏటూరునాగారం మండలంలోని ముళ్లకట్ట, చల్పాక గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఆయా గ్రామాల సర్పంచులు విద్యుత్ శాఖ అధికారులను కలిసి వినతిపత్రం అందించారు. ముళ్లకట్ట సర్పంచ్ ఈసం జనార్దన్, చల్పాక సర్పంచ్ అట్టం రాంబాబు గురువారం ఏటూరునాగారం మండల విద్యుత్ శాఖ డీఈని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు సంబంధించి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను డీఈ దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్ సమస్యల కారణంగా గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నందున సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. దీనిపై విద్యుత్ శాఖ డీఈ సానుకూలంగా స్పందిస్తూ, గ్రామాల్లో ఉన్న విద్యుత్ సమస్యలను పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామాల విద్యుత్ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని సర్పంచులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు తొలగింపు..

- బతుకమ్మ ఆడే స్థలాన్ని సైతం శుభ్రం..
- గ్రామపంచాయతీని అభివృద్ధి చేయడమే నా లక్ష్యం..
- లింగాల గ్రామపంచాయతీ సర్పంచ్ మొగిలిపల్లి రవీందర్



**బిఎన్ఎస్ తాడ్వాయి, అక్టోబర్ 08:**

తాడ్వాయి మండలం లింగాల గ్రామపంచాయతీ పరిధిలోని లవ్వాల గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, చెత్తచెదారాన్ని గురువారం సర్పంచ్ మొగిలిపల్లి రవీందర్ ఆధ్వర్యంలో డోజర్ సహాయంతో తొలగించారు. అలాగే బతుకమ్మ వేడుకలు నిర్వహించే స్థలాన్ని శుభ్రం చేయించారు. పంచాయతీ సిబ్బందితో సీసీ రోడ్లను కూడా శుభ్రపరిచారు. అనంతరం కొత్తగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్లలో బేస్‌మెంట్ స్థాయిలో ఉన్న నిర్మాణాలను సర్పంచ్ పరిశీలించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ లింగాల గ్రామపంచాయతీని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రజలకు అవసరమైన పారిశుధ్య, అభివృద్ధి పనులను నిరంతరం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మోడెమ్ రాజేష్, ఉపసర్పంచ్ నాలి ఉషారాణి, వార్డు సభ్యుడు చేపల సురేష్, గ్రామస్తులు పూనం సుధాకర్, వట్టం లక్ష్మీనారాయణ, వాసం సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ నుంచి పల్లె దవాఖాన వరకు పీఓ ఆకస్మిక తనిఖీలు

- విద్య, వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి -- లెనిన్ వత్సల్ టోప్పో
- విద్యార్థులు, చిన్నారులు, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలి




**బిఎన్ఎస్ ఏటూరునాగారం, అక్టోబర్ 8:**

ఏటూరునాగారం మండలంలో విద్య, ఆరోగ్య సేవల పరిస్థితులను మెరుగుపరచే లక్ష్యంతో ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో పలు ప్రభుత్వ సంస్థలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆకులవారి ఘనపూర్ అంగన్వాడీ కేంద్రం, జీపీ పాఠశాలతో పాటు ఏటూరునాగారం సబ్ సెంటర్--1 (పల్లె దవాఖాన), సబ్ సెంటర్--2లను సందర్శించారు. అంగన్వాడీలో చిన్నారుల హాజరు, పోషకాహారం, రికార్డులు, అభ్యసన సామగ్రిని పరిశీలించి పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని సిబ్బందికి సూచించారు. పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసన స్థాయిని తెలుసుకుని, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. పల్లె దవాఖానలు, సబ్ సెంటర్లలో వైద్య సేవలు, మందుల లభ్యత, నిల్వలు, రికార్డులు, రోగుల వివరాల నమోదును పరిశీలించారు. గ్రామీణ ప్రజలకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచుతూ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ విద్య, ఆరోగ్య సంస్థల్లో మెరుగైన సేవల కోసం అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పీఓ లెనిన్ వత్సల్ టోప్పో సూచించారు